క్లుప్తంగా

రోగుల మధ్యే కుక్కలు



నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగుల మధ్యే కుక్కలు తిరుగుతున్నా, పట్టించుకునే వారే కరువయ్యారు. పసి పిల్లలు, రోగులను కరిస్తే దిక్కెవరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌కు చెందిన ఓ వ్యక్తి కుక్కలను పెంచుతున్నారని సిబ్బంది పేర్కొంటున్నారు. కాగా ఈ విషయమై ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారులను సంప్రదించగా, కుక్కల్లేకుండా చూస్తామని చెప్పారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

కొడవలూరు: మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయని ఎస్‌ఈబీ సీఐ ఆర్ నరహరి పేర్కొన్నారు. నార్తురాజుపాళెంలోని సాయి లెండి డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడడం వల్ల శారీరకంగా, మానసికంగా బలహీనులుగా మారుతారన్నారు. మత్తుకు బానిసగా మారితే సమాజంలో విలువ కోల్పోతామన్నారు. కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల కరస్పాండెంట్ కే శశికాంత్‌రెడ్డి, ఎస్‌ఈబీ సిబ్బంది కే.శ్రీనివాస్, తులసి, మహిళా పోలీసు వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.257 కనీస వేతనం వచ్చేలా పనులు

పొదలకూరు : ఉపాధిహామీ కూలీలకు కనీస వేతనం రూ.257 గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలని డ్వామా పీడీ వెంకటరావు సూచించారు. మండలంలోని ఇనుకుర్తి గ్రామంలో జరుగుతున్న ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో పీడీ మాట్లాడుతూ ప్రస్తుతం ఇనుకుర్తి గ్రామంలో కూలీలకు రూ.230 వస్తున్నట్లు తెలిపారు. కనీస వేతనం రూ.257 గిట్టుబాటయ్యేలా పనులు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు కోటి పనిదినాలను పూర్తి చేసినట్లు వివరించారు. మార్చి నెలాఖరు నాటికి మరో 15 లక్షల పనిదినాలను పూర్తి చేయించామన్నారు. పీడీ వెంట ఏపీఓ మధుసూదన్, టీఏ, ఎఫ్ఏ ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

పొదలకూరు : మండలంలోని నావూరుపల్లి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లూరు నుంచి నావూరుకు వెళుతున్న కియా కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొనడంతో నావూరుపల్లికి చెందిన దయాకర్(35) అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని బంధువులు పొదలకూరు సీహెచ్‌సీకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం నెల్లూరు మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై కరిముల్లా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



కోవూరు(విడవలూరు): ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, ఎక్కడైనా అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని విడవలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బీ సుజాత పేర్కొన్నారు. విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై జూనియర్ మ్యాథ్స్ లెక్చరర్‌గా బదిలీపై వెళ్తున్న అనూరాధను సహచర సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సీనియర్ అసిస్టెంట్‌గా అనూరాధ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనుల పరిశీలన

కొడవలూరు: కమ్మపాళెం మజరా గుర్రాలదిన్నె, సంజీవనగర్ ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను ఎంఈఓ వసంత కుమారి బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం నాడు–నేడు కింద మండలంలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.13 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆమె వెంట హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, ఎఫ్రా ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



సమస్యలను తెలుసుకుంటున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, అభివృద్ధి పనులు చేస్తూ ముందుకెళ్తున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 8వ డివిజన్లో గల నవాబుపేట, బుజ్జమ్మతోట, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్లు, ప్యాచ్ వర్క్‌లు, విద్యుత్ స్తంభాలు, తదితర సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఎన్ని పనులను పూర్తి చేశామనే విషయాన్ని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయ్యాక ప్రజలకు తెలియజేస్తామన్నారు. కార్పొరేటర్ కామాక్షిదేవి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో రోడ్లు, డ్రెయిన్ల పనుల పూర్తి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 39, 40వ డివిజన్లలో రోడ్లు, డ్రెయిన్ల పనులను త్వరలో పూర్తి చేస్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 40వ డివిజన్ మూలాపేటలో ఎమ్మెల్యే పర్యటించిన సమయంలో పలు సమస్యలను స్థానికులు తెలియజేశారు. ఈ క్రమంలో సచివాలయ నిధులు రూ.20 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొండదిబ్బలోని మున్సిపల్ క్వార్టర్స్‌లో పునర్నిర్మించిన మహాలక్ష్మమ్మ దేవస్థానంలో పూజలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పనులను 20 రోజుల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు. డివిజన్లలో ఎక్కడెక్కడ సమస్యలున్నాయో గుర్తిస్తున్నామని, నెల్లో వీటిని ప్రారంభించేలా చర్యలు చేపడతామని వివరించారు. జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ప్రసన్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు సునీల్, ప్రసాద్, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అనిల్

గిరిజనుల సంక్షేమానికి కృషి



స్టిక్కర్‌ను అతికిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలోని గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. దొంతాలిలోని నాంచారమ్మ గిరిజన కాలనీలో నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. పార్టీ స్టిక్కర్లను అతికించిన అనంతరం ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ తమ పార్టీని ఆదరించాలని కోరారు. నాంచారమ్మ గిరిజన కాలనీ వాసులను చూసేందుకే తాను వచ్చానని చెప్పారు. అనంతరం డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడారు. కోటంరెడ్డి సోదరుల ఆగడాలతో నియోజకవర్గంలో పలువురు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి చొరవతో రూరల్‌లోని సమస్యలు పూర్తిగా పరిష్కారం కానున్నాయని పేర్కొన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఎంపీ కొద్దిసేపు మాట్లాడారు. తొలుత ఎంపీకి స్థానిక నేతలు, గిరిజనులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.

డయాలసిస్ రోగికి సాయం

డయాలసిస్ చేయించుకునేందుకు తాను ఇబ్బంది పడుతున్నానని గిరిజన కాలనీకి చెందిన ఓ మహిళ ఎంపీకి తెలియజేశారు. దీంతో రూ.30 వేలను ఆయన అందజేశారు. మెరుగైన వైద్యం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవి, మర్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ అరుణమ్మ, నేతలు హరిబాబుయాదవ్, శంకరయ్య, సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

• రూ.మూడు లక్షల మేర ఆస్తి నష్టం



నెల్లూరు(క్రైమ్): ఏసీలో షార్ట్ సర్క్యూటై మంటలు చెలరేగి రూ.మూడు లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిన ఘటన ఏసీనగర్ రామాలయ వీధిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. ఏసీనగర్‌లోని రామాలయ వీధిలో గల ఓ అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తులో రామకృష్ణ నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో పని నిమిత్తం అందరూ బయటకెళ్లారు. మధ్యాహ్నం సుమారు ఒకటిన్నర గంటల ప్రాంతంలో ఏసీ షార్ట్ సర్క్యూటై అగ్నిప్రమాదం సంభవించింది. ఇంట్లో నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు విషయాన్ని రామకృష్ణకు ఫోన్లో చెప్పారు. బాలాజీనగర్ పోలీసులకు ఆయన సమాచారం అందించారు. ఎస్సై సుమన్ అందించిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో రూ.మూడు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది.

మంత్రిని కలిసిన అధికారులు



నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని రైతు సాధికారిక సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రభాకర్ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంపై వివరించారు. అధికారులు రవిచంద్రప్రసాద్, సుమన్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాంతసేవ



నెల్లూరు(బృందావనం): అనంత కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో 16 రోజుల పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, కల్యాణం, ఏకాంతసేవను మందిర ప్రధానార్చకుడు దాశరథి నారాయణాచార్యులు జరిపారు. కోలాట ప్రదర్శనను శ్రీనివాస కోలాట మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయకర్తలుగా సత్యరామప్రసాద్, వాసవి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, వెంకటరత్నం, కోశాధికారి మస్తాన్‌రావు, వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండప కోశాధికారి మోహన్‌రావు, తదితరులు పర్యవేక్షించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నెల్లూరు (లీగల్): రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేంద్రప్రసాద్ మరో ఇద్దరు హైకోర్టు న్యాయవాదులకు సీఐడీ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బుధవారం బహిష్కరించారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి రోజారెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు, కోటేశ్వరరావు, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బీజేపీని సాగనంపి.. దేశాన్ని కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో వెంకటేశ్వరపురం సెంటర్ నుంచి భారీ ర్యాలీని బుధవారం చేపట్టారు. సీపీఐ నగర కన్వీనర్ నాగేంద్రసాయి, సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు, నేతలు ప్రసాద్, పద్మ, వెంకటేశ్వర్లు, జాఫర్, సీపీఐ నేతలు మున్నా, ముక్తియార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



ఎస్ఈకి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు కోరారు. ఈ మేరకు నగరంలోని విద్యుత్ భవన్‌లో ఎస్పీడీసీఎల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్యకు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా యూఈఈయూ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. నేతలు పెంచలప్రసాద్, నాగయ్య, హరినారాయణ, మునికృష్ణయ్య, ముజహర్, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన



నెల్లూరు(క్రైమ్): అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన అవసరమని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని పిడతాపోలూరులోని రత్నం విద్యాసంస్థల్లో బుధవారం నిర్వహించారు. తమను తాము రక్షించుకుంటూ ఇతరులను ఎలా రక్షించుకోవాలనే అంశంపై విద్యార్థులకు డెమో ద్వారా వివరించారు. నెల్లూరు అగ్నిమాపక కేంద్ర అధికారి జాషువా, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): కమిషనర్ వికాస్ మర్మత్‌ను కార్పొరేషన్ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళాధ్యక్షురాలు, 21వ డివిజన్ కార్పొరేటర్ గౌరి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. కమిషనర్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్లు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పార్టీ 21వ డివిజన్ ఇన్‌చార్జి సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పునరావాస కార్యక్రమాల పూర్తి



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ముత్తుకూరు మండలంలోని నేలటూరులో పునరావాస కార్యక్రమాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. పునరావాస చర్యల పురోగతిపై తన చాంబర్‌లో జేసీ కూర్మనాథ్, ఆర్డీఓ మలోలతో బుధవారం సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. నేలటూరులో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో భాగంగా ప్రారంభం కావాల్సిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా కంపెనీల ప్రతినిధులు సైతం పెండింగ్‌లో ఉన్న నగదును త్వరగా జమచేయాలని సూచించారు. జెన్‌కో ఎస్ఈ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా సంక్షేమ సంఘ అధ్యక్షుడికి సత్కారం



నెల్లూరు(బృందావనం): కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పలువుర్ని బుధవారం సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ నూర్‌బాషా సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు కాలేషాను సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. సుబేదారుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకుడు సుబ్బారావు, అభినయ ఆర్ట్స్ అధ్యక్షుడు రాఘవ, ప్రేమ్‌సాధ అధ్యక్షుడు సత్యనారాయణ, అడ్వొకేట్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



నెల్లూరు(బృందావనం): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కోటమిట్టలోని షాదీమంజిల్‌లో ఇఫ్తార్ విందును నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ బుధవారం నిర్వహించారు. తొలుత ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ కరిముల్లా, కో ఆప్షన్ సభ్యుడు జమీర్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మీరామొహిద్దీన్, మైనార్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు సిద్ధిఖ్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో జేసీ సమీక్ష



నెల్లూరు(అర్బన్): క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను అధికారులు పరిష్కరించాలని జేసీ కూర్మనాథ్ ఆదేశించారు. కలెక్టరేట్లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో బుధవారం సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఏపీ సేవ, స్పందన డ్యాష్ బోర్డులను అధికారులు నిత్యం గమనించాలని సూచించారు. స్పందన అర్జీలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సమీక్షిస్తున్నారని, ఈ తరుణంలో వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎంహెచ్ఓ పెంచలయ్య, జెడ్పీ సీఈఓ చిరంజీవి, సీపీఓ రాజు, సర్వే శాఖ ఏడీ హనుమాన్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఉద్యమ విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

నెల్లూరు(పొగతోట): సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించతలపెట్టిన ఉద్యమ విజయవంతానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం, పంచాయతీరాజ్ చాంబర్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ కోరారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్వర్యంలో సర్పంచ్‌లతో సమావేశాన్ని నగరంలోని ఓ హోటల్లో బుధవారం నిర్వహించారు. అనంతరం ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచ్‌ల సంఘ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీముత్యాలరావు, జిల్లా అధ్యక్షుడు శివకుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేంద్రప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, మునేష్, పావని, సుబ్బరామయ్య, ధనుంజయ్‌యాదవ్, ముత్యాలరావు పాల్గొన్నారు.

రామాయపట్నం పోర్టుకు భూసేకరణ జరపాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని రామాయపట్నం పోర్టు, హబ్‌కు భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. కలెక్టరేట్లోని తన చాంబర్‌లో అధికారులతో బుధవారం సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. పునరావాసం, భూసేకరణ, పరిహారం, తదితర అంశాలపై చర్యలు చేపట్టాలని చెప్పారు. జువ్వలదిన్నెలో మత్స్యకారుల కోసం మారిటైమ్ బోర్డ్ పనులు 60 శాతం పూర్తయ్యాయని మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు నాగేశ్వరరావు తెలిపారు. పోర్టు లైజన్ అధికారి వెంకటేశ్వరరెడ్డి, సబ్ కలెక్టర్ శోభిక, ఆర్డీఓ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు




నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కించారు. గతేడాది అక్టోబర్ 21 నుంచి బుధవారం వరకు కానుకల రూపంలో భక్తులు రూ.92,660 మేర సమర్పించారని ఈఓ దర్గయ్య తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత సుధీర్, మహేష్, దేవదాయ శాఖకు చెందిన నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం



నెల్లూరు (వేదాయపాళెం): బడుగు, బలహీన వర్గాలకు స్వాతంత్ర్య సమరయోధుడు గౌతు లచ్చన్న అందించిన సేవలు చిరస్మరణీయమని గౌడ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులుగౌడ్ పేర్కొన్నారు. పొగతోటలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో గౌతు లచ్చన్న వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామ్ ముదిరాజ్, జై గౌడ సంఘ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఉద్యోగుల సంఘ రాష్ట్ర నేత రమణయ్య, కృష్ణ, వేణుగోపాల్, పరమేశ్వర్, కిషోర్, బాలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణహత్య



నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని ఎస్సీ కాలనీలో వ్యక్తి దారుణహత్యకు గురైన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. వ్యవసాయం చేసుకొని జీవనం సాగించే సాదేపల్లి చిన్నయ్య (46)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళతో 15 ఏళ్లుగా చిన్నయ్య సన్నిహితంగా ఉంటున్నారు. మద్యం మత్తులో ఆమెతో ఇష్టారాజ్యంగా వ్యవహరించేవారు. ఈ క్రమంలో సురేంద్ర, రమణయ్య, శ్రీనివాసులు, మరికొందరు వివిధ వాహనాల్లో చిన్నయ్య ఇంటికి చేరుకున్నారు. నానా హంగామా చేసి, బైక్‌ల హారన్లతో హోరెత్తించారు. ఇంటి బయటకొచ్చిన చిన్నయ్యపై బరిసెలు, కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఛాతి, వీపుపై కత్తులతో పొడిచారు. అడ్డొచ్చిన చిన్నయ్య భార్య రాజమ్మను ముళ్ల చెట్లలోకి తోసేసి, కుమారుడు చేతన్‌కుమార్‌పై దాడికి పాల్పడ్డారు. ఘటనలో కంటిపై బలమైన గాయమైంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని చిన్నయ్యను పరీక్షించారు. అప్పటికే ఆయన మృతి చెందారని నిర్ధారించారు. ఘటన స్థలానికి చేరుకున్న నెల్లూరు రూరల్ పోలీసులు విచారణ జరిపారు. రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు.